Eenadu (11/05/2012)
Page No. 5




డీవీడీని విడుదల చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి, 'ఇన్‌కాయిస్' అధికారులు

# సునామీపై ప్రజల్లో అవగాహన పెంచాలి

## 'ఇన్‌కాయిస్'కు మర్రి శశిధర్‌రెడ్డి సూచన

హైదరాబాద్, న్యూస్‌టుడే: సునామీపై ప్రజల్లో పూర్తిగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ) ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. జాతీయ మహాసముద్ర వాతావరణ సమాచార సేవల కేంద్రం(ఇన్‌కాయిస్)లో గురువారం జరిగిన వినియోగదారుల వార్షిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సునామీపై ప్రస్తుతం అధికారుల్లో, ప్రజల్లో సరైన అవగాహన లేదన్నారు. సముద్రంలో చేపల లభ్యతపై 'ఇన్‌కాయిస్' ముందస్తు సమాచారం ఇవ్వడం వల్ల మత్స్యకారులకు మంచి ఆదాయం వస్తోందని తెలిపారు. ఇటీవల గుజరాత్‌లో ఓ మత్స్యకారుడికి గోల్డ్‌ఫిష్ దొరకడం వల్ల కోటి రూపాయల ఆదాయం వచ్చిందని, ఇలాంటి చేపలు సముద్రంలో ఎక్కడ ఉంటాయో ఇన్‌కాయిస్ చెప్పగలిగితే ఇంకా మేలు జరుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా కోస్తాతీరంపై ఇన్‌కాయిస్ రూపొందించిన అట్లాస్‌ను ఆయన విడుదల చేశారు. సముద్రంలో నౌకలు ప్రయాణించే మార్గాల్లో వాతావరణ సమాచారం తెలిపే వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. వ్యవసాయ సంబంధ వాతావరణ సమాచారంతో కూడిన డీవీడీని విడుదల చేశారు. ఈ సదస్సుకు పలురాష్ట్రాల నుంచి ఉన్నతాధికారులు, మత్స్యకారులు హాజరయ్యారు.

హెల్ప్‌లైన్ల ఏర్పాటు.: సముద్ర స్థితిగతులను, మత్స్యసంపద ఆచూకీని జాలర్లు ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు శాస్త్రవేత్తలు ప్రత్యేక హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్: 75690 59856, 75690 79047, తమిళనాడు: 92824 42311, 12 ఫోన్ నెంబర్లను కేటాయించినట్లు 'ఇన్‌కాయిస్' శాస్త్రవేత్తలు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మిగతా రాష్ట్రాల్లోనూ హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.